# నాలుగు నెలలైనా స్ట్రీట్ లైట్స్ వేయరా

**జీహెచ్ఎంసీ అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్**

మెహిదీపట్నం, జనవరి 29, ప్రభాతవార్త : బస్తీవాసులు ఫిర్యాదు చేసి నాలుగు నెలలైనా కనీసం స్ట్రీట్ లైట్స్ వేయకపోతే ఎలా అని కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం సికింద్రాబాద్ పార్లమెంట్‌సెగ్మెంట్ పరిధిలోని నాంపల్లి నియోజకవర్గంలో పర్యటించారు. మల్లెపల్లి డివిజన్ ఆగాపురా బస్తీలో పవర్ బోర్ ప్రారంభించిన అనంతరం గడపగడపకు వెళుతూ స్థానికుల సమస్యలను అడిగి తెలుసున్నారు. పర్యటనలో భాగంగా.. నాంపల్లి వద్ద పర్యటించిన కిషన్‌రెడ్డికి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. **మిగతా సిటీ 3వ పేజీలో**



స్థానికులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ వార్త



# దళితుల ఇళ్లు నేలమట్టం

## వివేకానందనగర్ బస్తీలో తీవ్ర ఉద్రిక్తత

గాంధీనగర్ డివిజన్‌లోని వివేకానందనగర్ కాలనీలో ఇళ్లను జిహెచ్ఎంసి అధికారులు సోమవారం కూల్చివేయడంతో తీవ్ర ఉద్రిక్తతత వాతావరణం నెలకొంది. వివేకానందనగర్‌లో 23 దళిత కుటుంబాలు దాదాపు 70ఏళ్ళుగా ఇళ్ళను నిర్మించుకుని ఉంటున్నారు. సోమవారం ఉదయం రెవెన్యూ, జిహెచ్ఎంసి, పోలీసుల సహకారంతో అక్రమంగా నిర్మించిన ఇళ్ళను కూల్చివేశారు. దీంతో స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ, రెవెన్యూ అధికారులు బలవంతంగా పోలీసుల బందోబస్తు మధ్య తమ ఇళ్ళను కూల్చివేయడం చాలా అన్యాయమని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ళలో సామాగ్రి ఉందని చెబుతున్నా వినలేదని రోధిస్తూ వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ కొందరు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడగా.. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. బాధితులకు ధరణి విచారణ కమిటీ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.



ఇళ్ళను కూల్చివేసిన దృశ్యం

**బాధితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళు కేటాయించాలి: ఎమ్మెల్యే ముఠాగోపాల్**

వివేకానందనగర్ బస్తీ వాసులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళను కేటాయించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ డిమాండ్ చేశారు. అకారణంగా ఇళ్ళను కూల్చివేయడం అన్యాయమన్నారు. కోర్టు ఆదేశాలు న్నాయని పేదల ఇళ్ళను నేలమట్టం చేయడం అన్యామని, వారికి ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, పార్టీ నేతలు ఎం.రాకేశ్‌కుమార్, ముఠానరేశ్, జివై.గిరి తదితరులున్నారు.

చిక్కడపల్లి, జనవరి 29 ప్రభాతవార్త: ఇళ్ళను కూల్చివేసిన స్థలానికి వచ్చిన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ముషీరాబాద్ తహాశీల్దార్ వెంకట లక్ష్మి, జిహెచ్ఎంసి సర్కిల్-15 డిఎంసి డాక్టర్ తిప్పర్తి యాదయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమంత్ కుమార్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేశ్ పర్యవేక్షణలో జిహెచ్ఎంసి సిబ్బంది జేసీబీలతో అక్కడికి చేరుకోవడంతో బస్తీవాసులు అడ్డుకునే ప్రయత్నంచేశారు. దీంతో వారందరిని అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్‌తో పాటు రామ్‌నగర్ కార్పొరేటర్ రవిచారి, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, మరికొంత మంది బిజెపి, బిజెవైఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఒక సమయంలో అక్కడికి చేరుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను పోలీసులు అడ్డుకున్నారు. **మిగతా సిటీ 3వ పేజీలో**

# మళ్లీ చలి పంజా విసురుతోంది

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త : నగరంలో చలి తీవ్రత తగ్గడంతో పలు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టింది. దీంతో నగరవాసులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ..కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవడం నగవాసులను భయాందోళనకు గురిచేస్తోంది. పలు ప్రాంతాల్లో 16 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో నగరవాసులు మరోసారి చలికాలం చవిచూడాల్సి వస్తోంది. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం దాదాపు అన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా ఉన్నాయి. హైదరాబాద్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి గాలులు వీస్తున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు 18 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా పడిపోవడంతో శీతాకాలపు చలి తిరిగి వస్తుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఇక హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 17 నుంచి 20 డిగ్రీల సెల్సియస్‌లో ఉంటాయని టిఎస్‌డిపిఎస్ అంచనా వేసింది. నగరంలో పొగ మంచు కురిసే అవకాశం ఉందిన వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. శీతాకాలపు చలి రాబోయే రెండు రోజుల్లో నగరానికి తిరిగి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉదయం వేళల్లో పొగమంజుతో కూడిన వాతావరణం కనిపించే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హైదరాబాద్ కేంద్రం తెలిపింది. అయినప్పటికీ పొగ మంజు హెచ్చరికలు జారీ చేయబడలేదు, సాధారణంగా మేఘావృతమైన ఆకాశం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.



మారేడ్‌పల్లిలో రాత్రి 15.2, పగడి పూట 28.2 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. అలాగే తిరుమలగిరి, శేరిలింగంపల్లి, గోల్కొండ ప్రాంతాల్లో రాత్రి కనిష్ట ఉష్ణోగ్రత 16.5 నుంచి 16.9 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతుంది. అదే గరిష్ట ఉష్ణోగ్రత 28 నుంచి 30 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతుంది. బహుదూర్‌పురా పరిసర ప్రాంతాల్ల కనిష్ట కనిష్ట ఉష్ణోగ్రత 17.9 గరిష్ట ఉష్ణోగ్రత 29 డిగ్రీలుగా నమోదైంది.



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లాకలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను త్వరగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరించాలని అన్నారు. వివిధ మండలాల తహసీల్దార్లతో మాట్లాడుతూ తమరి పరిధిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈప్రజావాణి కార్యక్రమంలో (35) ఆర్జీలురాగా అందులో గృహనిర్మాణశాఖకు (20), ఇతర శాఖలకు (15) వచ్చాయని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూధన్, ఆర్డీవోలు సూర్యప్రకాశ్, రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శిశు విహార్ హెల్త్ సెంటర్ ప్రారంభం



మధురానగర్ స్టేట్ హోంలో శిశు విహార్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

యూసుఫ్‌గూడ, జనవరి 29, ప్రభాతవార్త : మధురానగర్‌లోని స్టేట్ హోంలో సోమవారం శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క పాల్గొని శిశు విహార్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈనిర్మాణానికి స్టేట్ హోం ఆధ్వర్యంలో నడుస్తున్న శిశు విహార్ చిల్డ్రన్స్ హోం నూతన భవన నిర్మాణానికి సహాయ నిధిగా రూ.80లక్షలను రేవంత్ దాస్ గుప్త , సంతోష్ గుప్తాలు మానవత దృక్పథంతో ముందుకు వచ్చినిధులు అందజేయడంతో మంత్రి వారిని వారి కుటుంబ సభ్యులను అభినందించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# బరితెగింపు!

## అక్రమ భారీషెడ్లకు కేరాఫ్‌గా భౌరంపేట

- ✦ ఏడాదిన్నరలో పదుల సంఖ్యలో వెలసిన అనుమతుల్లేని షెడ్లు
- ✦ లోకల్ అంటూ చేతులెత్తేస్తున్న చైన్‌మెన్
- ✦ మాదృష్టికి రాలేదంటూ బుకాయిస్తున్న అధికారులు
- ✦ ఫిర్యాదులు చెత్తబుట్టలోకి... కాసులు ఖజానాలోకి
- ✦ దృష్టిసారించని టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, హెచ్ఎండిఏ

ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం.. స్థానిక అధికార యంత్రాంగం బాధ్యతారహితం.. పాలకుల సంపూర్ణం సహకారం వెరసి అక్రమ నిర్మాణదారులు రెచ్చిపోతున్నారు. బరితెగింపుతో అనుమతుల్లేని భారీ షెడ్లు విచ్చలవిడిగా నిర్మిస్తున్నారు. ఒక్కటి కాదు..రెండు కాదు..ఏడాదిన్నర కాలంలో పదుల సంఖ్యలో అనుమతుల్లేని భారీషెడ్ల నిర్మాణాలు చోటు చేసుకున్న అధికార యంత్రాంగం చర్యలకు చేపట్టకపోవడం వెనుక అంతర్యం ఏమిటి..? అక్రమాలపై ఉక్కుపాదం మోపండి అని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయకపోవడం ఈమున్సిపల్ అధికారులకే చెల్లుతుందని, అక్రమాలపై చేసిన ఫిర్యాదులు చెత్తబుట్టలోకి...అక్రమార్కుల నుండి అందిన నజరానాలు తమతమ ఖజానాలోకి మళ్ళిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, హెచ్ఎండిఏ అధికారులు సైతం అక్రమాలపై దృష్టిసారించకోవడం గమనార్హం.

శిఖర స్కూల్ సమీపంలో వెలసిన భారీ షెడ్డు



దుండిగల్, జనవరి 29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట అనుమతుల్లేని భారీషెడ్లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. ఒక్క భౌరంపేట పరిధిలోనే ఏడాదిన్నర కాలంలో అనుమతుల్లేని భారీషెడ్లు 20కు పైగా నిర్మాణాలు చోటు చేసుకోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి, ధనదాహానికి ప్రతీక పేర్కోనవచ్చు. ప్రభుత్వం నిబంధనలకు భేఖాతర్ చేస్తూ 400 గజాల నుండి 1500గజాలకు పైగా విస్తీర్ణంలో భారీషెడ్ల నిర్మాణాలు జోరుగా నడుస్తున్న కట్టడి చేయడంలో అధికార యంత్రాంగం విఫలమవుతున్నారు. అక్రమాలపై స్థానికులు ఎవరైన ఫిర్యాదు చేస్తే అప్పుటికప్పుడు సదరు నిర్మాణాల వద్దకు వెళ్ళి హాడావుడి చేసి కాసేపటికి తిరుగు పయనమవడంతో యాథావిధిగా నిర్మాణాలు కొనసాగిస్తూ కోట్లాది రూపాయల ప్రభుత్వ ఆదాయం కొల్లగొడుతున్నట్లు తెలుస్తుంది.

**పుట్టగొడుగుల్లా వెలుస్తున్న భారీషెడ్లు..**

భౌరంపేట పరిధిలో భారీషెడ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఏడాదిన్నర కాలంలో పదుల సంఖ్యలో నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. భౌరంపేట కమాన్ వద్ద (మియాపూర్ టూ గండిమైసమ్మ ప్రధాన రహదారి పక్కన) వెలసిన ఏ నిర్మాణానికి అనుమతులు లేకపోవడం గమనార్హం. భ్రమరాంభ ఫంక్షన్‌హాల్ సమీపంలో, భౌరంపేట నుండి డంపింగ్‌యార్డు మీదుగా ఓఆర్ఆర్‌కు వెళ్ళే మార్గంలో, శిఖర స్కూల్ సమీపంలో, బోర్రాయి నుండి మియాపూర్ వెళ్ళే **మిగతా సిటీ 3వ పేజీలో**

# అర్థరాత్రి సైకో హాల్‌చల్

**డబ్బులు ఇవ్వమని పదునైన బ్లేడ్‌తో ఇద్దరిపై దాడి**

**గుర్తు తెలియని వ్యక్తి మృతి, మరొకరికి గాయాలు**



సైకో చేతిలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్త: అర్థరాత్రి ఓ సైకో హాల్‌చల్ చేసి ఇద్దరిపై రేడియం స్టిక్కర్ల కటింగ్‌కు ఉపయోగించే పదునైన బ్లేడ్‌లతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి గాయాల పాలయ్యాడు. ఈ ఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వారం రోజులు తిరగక ముందే ఇలాంటి రెండు ఘటనలు జరుగడంతో స్థానికంగా సంచలనం రేపింది. పోలీసుల కథనం ప్రకారం సోమవారం తెల్లవారుజామున 12.30 గంటలకు సర్దార్‌పటేల్ రోడ్‌లోని వైఎంసీఏ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఓ గుర్తు తెలియని వ్యక్తి మరో గుర్తు తెలియని వ్యక్తి వద్దకు వచ్చి డబ్బులు డిమాండ్ చేశాడు. దీనికి అతను నిరాకరించడంతో అతని ముఖం, గొంతుపై పదునైన బ్లేడ్‌తో దాడి చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన వ్యక్తి అదే ప్రాంతంలో ఉన్న ఫుట్‌పాత్‌పై పడిపోయాడు. దాడికి పాల్పడ్డ వ్యక్తి హరిహర కళాభవన్ పక్కనే ఉండే యశోద అస్పత్రి రోడ్డుకు చేరుకున్నాడు. ఆదే సమయంలో జూబ్లీ బస్టాండ్ ఫుట్‌పాత్‌పై ఉంటు లేబర్‌గా పనిచేసే మిథేష్ యాదవ్ వద్దకు వచ్చి డబ్బులు డిమాండ్ చేశాడు. దానికి అతడు నిరాకరించడంతో తన వద్ద ఉన్న బ్లేడ్‌తో అతని ముఖంపై దాడి చేశాడు. **మిగతా సిటీ 3వ పేజీలో**

## సాఫ్ట్‌వేర్ శిక్షణకు వచ్చి

# దొంగగా మారి..

**సొదరిడితో కలిసి ఇంటికి కన్నం**

**పోలీసులకు చిక్కి కటకటాలు పాలు**

**12లక్షలు విలువైన సొత్తు స్వాధీనం**

అల్వాల్, జనవరి 29 ప్రభాతవార్త: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడడానికి ఎన్నో కలలుతో నగరానికి వచ్చాడా యువకుడు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవడంతో దిక్కు తోచని స్థితిలో వరసకు సోదరుడైన వ్యక్తితో దొంగగా మారాడు. అల్వాల్‌లోని ఓ ఇంటిలో దొంగతనం చేసి కటకటాలు పాలయ్యాడు. రిమాండ్‌కు సంబంధించి అల్వాల్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కర్నూలు జిల్లాకు చెందిన అశోక్‌రెడ్డి(31) పది సంవత్సరాలు క్రితం జీవనోపాది కోసం నగరానికి రావడం జరిగింది. షాపూర్‌నగర్‌లో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి వరసకు సోదరుడైన కర్నూలు వాసి మురళీధర్ రెడ్డి(30) ఎంబిఎ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ కోర్సులులో శిక్షణ కోసం సంవత్సరం క్రితం నగరానికి వచ్చి ఇసిఐఎల్‌లో ఉంటున్నాడు. చదువు కోసం అవసరమైన డబ్బులు లేక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నెల 17వ తేదీన మురళీధర్ రెడ్డి సోదరుడు అశోక్‌రెడ్డి ఇంటికి వెళ్ళి అప్పులు భరించలేక పోతున్నానని దొంగతనం చేద్దామని చెప్పాడు. ఇందుకు మురళీధర్ రెడ్డి ఒప్పుకున్నాడు. 20వ తేదీన పని ఉందని చెప్పి స్నేహితుడి పల్సర్ బైక్ తీసుకుని అల్వాల్ ప్రాంతంలో దొంగతనం చేయడానికి రెండు గంటలు పాటు రెక్కీ నిర్వహించారు. పంచ్‌షీల్ కాలనీలో ఓ ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించారు. ఇనుప రాడ్ సహాయంతో **మిగతా సిటీ 3వ పేజీలో**

# కనీస వేతనాలు అమలు చేయాలి

## టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం



ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ నేతలు

ముషీరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: రాష్ట్ర విద్యాశాఖలో కేంద్ర ప్రాయోజిత పథకం సమగ్ర శిఓ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కేజీబివి, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు, గిరిజన సంక్షేమ శాఖలో సీఆర్టీలకు కనీస వేతనాలు అమలుచేయాలని టీఎస్‌యూటీఎఫ్ నేతలు విజ్ఞప్తి చేశారు. సోమవారం టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలసి వారు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును కూడా అమలుచేయలేదని ఆరోపించారు. ఫిబ్రవరి నెలలో జరగనున్న కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు సమావేశంలో సమగ్ర శిఓ ఉద్యోగులందరికీ వారు పని చేస్తున్న పోస్టు యొక్క మినిమం టై స్కేల్, బేసిక్ పే అమలుచేసే విధంగా ప్రతిపాదనలు సమర్పించి, ఆమోదింపచేసి,అమలుచేయాలని కోరారు. అదే విధంగా ట్రెజరీలో ఆమోదం పొంది ఏడాది కాలంగా ఇకుబేర్‌లో పెండింగ్‌లో బిల్లులను విడుదల చేయాలని, పాఠశాలలకు ఉచిత విద్యుత్ అమలుచేయాలని, బీసీ గురుకులాల పనివేళలు ఇతర గురుకులాలతో సమానంగా మార్చాలని కోరారు. దీనిపై స్పందించిన ఉపముఖ్యమంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి, పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రిని కలసిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు కే.జంగయ్య, చావ రవి, సీనియర్ నాయకులు మాణిక్‌రెడ్డి ఉన్నారు.

## నేడు మటన్, చికెన్ షాపులు బంద్

హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలోని మాసం దుకాణాలు మూసివేయనున్నారు. చికెన్,మటన్ దుకాణాలతోపాటు, గొర్రెలు, మేకలు, పశువులు కబేళాలు, రిటైల్ మాసం, గొడ్డుమాంసం దుకాణాలను మూసివేయనున్నారు. ఈక్రమంలో సోమవారం జిహెచ్ఎంసి కమిషనర్ ఉత్తర్వులను జారీ చేశారు. సంబంధిత దుకాణాలు మూసివేసేందుకు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని మూడు కమిషనరేట్ పోలీసులను రోనాల్డ్‌రోస్ అభ్యర్థించారు.

## కెమికల్స్ ల్యాబరేటరీ షాపులపై పోలీసుల దాడులు, రెండు షాపుల సీజ్

అఫ్జల్‌గంజ్,జనవరి 29ప్రభాతవార్త: సరైన అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి కెమికల్‌ల్యాబరేటరీ షాపులను అబిడ్స్ పోలీసులు, జిహెచ్ఎంసి సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించి సీజ్ చేశారు. అబిడ్స్ తిలక్‌రోడ్డులోని స్కూల్,కాలేజీలకు చెందిన కెమికల్ ల్యాబరేటరీల సామాగ్రి విక్రయించే రెండుషాపులలో అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ టి.నర్సింహారాజు జిహెచ్ఎంసి 14వ సర్కిల్ ఎ.ఎం.ఓ.హెచ్ శ్రీకాంత్‌రెడ్డిలు తమ బృందాలతో సంయుక్తంగా కలిసి తనిఖీలు చేపట్టారు. రెండుషాపులలో ఎలాంటి సేఫ్టీమేజర్లుగాని, వ్యాల్యూడ్‌లైసెన్స్ గాని, జిఎస్టీగాని లేకపోవడం తోఅధికారులు ఆశ్చర్యపోయారు. ప్రమాదకరమైన కెమెకల్ ల్యాబరేటరీ షాపులలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న రెండు దుకాణాలపై ఐపిసి336,286 సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసి సీజ్‌చేశారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు, ఏ.ఎం.ఓ.హెచ్ శ్రీకాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రమాదకరమైన కెమికల్స్ పదార్థాలు విక్రయించినప్పుడు షాపుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు.



లైటింగ్ సిస్టంతో కనువిందు చేస్తున్న ఆర్ట్స్‌కాలేజ్



తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో ప్రముఖ సాంస్కృతిక, సామాజిక స్వచ్ఛంద సేవాసంస్థ ఉజ్వల ఆధ్వర్యంలో రవీంద్రభారతి సమావేశ మందిరంలో ఎక్సలెన్సీ అవార్డ్స్ ప్రదానంచేస్తున్న దైవజ్ఞశర్మ, శివనరసింహా, నర్సింగ్, ఎం.లక్ష్మి

# గోపన్‌పల్లి మేళ్లకుంట చెరువును రక్షించాలి



మేళ్లకుంట అలుగు కాలువకు అడ్డంగా చేపడుతున్న నిర్మాణం

గచ్చిబౌలి, జనవరి 29 ప్రభాతవార్త: శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లిలో గల మేళ్లకుంట (దేవునికుంట) చెరువును రక్షించాలని కోరుతూ ప్రకృతి మిత్రా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శేరిలింగంపల్లి తాహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి మిత్రా అధ్యక్షుడు రవీంద్రప్రసాద్ దుబే మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 22లో గల మేళ్లకుంట చెరువు ఆక్రమణకు గురవుతుందన్నారు. చెరువు నీరు బయటకు వెళ్లే అలుగు మార్గంలో కాలువను పూడ్చి భారీ బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. అలుగు నీటి కాలువ ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారని, దీని కారణంగా వర్షాకాలంలో చెరువు నిండి అలుగు పారితే ఇబ్బందులు తప్పవని తెలిపారు. దీంతో పాటు చెరువు లోపలికి నీళ్లు వచ్చే కాలువను సైతం కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కనుమరుగు చేస్తున్నారని వాపోయారు. చెరువులోపలికి వరద నీరు వచ్చే కాలువ అడ్డంగా ప్రహరీ నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. గోపన్‌పల్లి రంగనాథస్వామి దేవాలయం గుట్టకింద ఉన్న మేళ్లకుంట చెరువుకు ఎంతో విశిష్టత ఉందని, గతంలో ఈ చెరువు నీటిని రంగనాథస్వామి ఆలయానికి వాడుకునే వారని, ప్రజలు వాడుకోవడంలో సైతం ఈ చెరువును దేవునికుంటగా పిలుచుకుంటారని తెలిపారు. ప్రస్తుతం ఈ చెరువు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలను రక్షిస్తుందని తెలిపారు. ఎంతో విశిష్టత ఉన్న ఈచెరువు అలుగు కాలువను, చెరువులోకి వరద నీరు వచ్చే కాలువలను కాపాడి చెరువును రక్షించాలని కోరారు.

# ప్రజావాణిలో సమస్యల వెల్లువ

**కుత్బుల్లాపూర్, గాజుల రామారం సర్కిళ్లలో ఫిర్యాదులు**



ఎన్నికలకు ముందు నిలిచిపోయిన రోడ్ల నిర్మాణాలపై గాజులరామారం ఉపకమిషనర్ మల్లారెడ్డికి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న రంగానగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్ గుప్తా, సంక్షేమసంఘ ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, జనవరి 29 ప్రభాతవార్త : నగర శివారు కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో సమస్యలు వెల్లువెత్తాయి. గాజులరామారం సర్కిల్ నుండి వివిధ సమస్యలపై మొత్తం 12 సమస్యలపై ఫిర్యాదులు రాగా కుత్బుల్లాపూర్ సర్కిల్ నుండి ఫిర్యాదులు అందాయి. చింతల్ డివిజన్ రంగానగర్ కాలనీలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రతిపాదనలు పూర్తయిన రోడ్డు పనులకు అప్పట్లో ఎన్నికలకోడ్ కారణంగా నిర్మాణ పనులను నిలిచిపోయాయి. ఈవిషయమై రంగానగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్‌గుప్తా ఆధ్వర్యంలో స్థానికులు పెద్దఎత్తున గాజులరామారం మున్సిపల్ సర్కిల్(26) ఉపకమిషనర్ మల్లారెడ్డికి ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. తమకాలనీలో రోడ్ల నిర్మాణం, మరమమ్మత్తులను వెంటనే పూర్తిచేశాయని కోరారు. ఇంజనీరింగ్ విభాగం నుండి ఆరు ఫిర్యాదులు, పన్నుల విభాగం నుండి మూడు ఫిర్యాదులు, టౌన్‌ప్లానింగ్ విభాగం నుండి మూడు ఫిర్యాదులు వచ్చినట్లు సహాయ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇక కుత్బుల్లాపూర్ సర్కిల్ (25)లో ఇంజనీరింగ్ నుండి, యుబిడి విభాగం , ఎలక్ట్రికల్ విభాగాలపై ఒక్కో ఫిర్యాదు వచ్చినట్లు సర్కిల్ ఉపకమిషనర్ వడ్డేపల్లి నర్సింహ్మా తెలిపారు.

# మౌలాలి పారిశ్రామికవాడ చైర్మన్‌గా దాట్ల సత్యనారాయణరాజు



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త: మౌలాలి పారిశ్రామికవాడ నూతన చైర్మన్‌గా దాట్ల సత్యనారాయణరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రాధాకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా మధుకర్‌రెడ్డి, కోశాధికారిగా కెవిన్ బెనోజ్, కార్యనిర్వాహక సభ్యులుగా వాసుదవేవగౌడ్, వివేకానంద, వెంకట బాలకృష్ణ, మాధవరెడ్డి,విక్రంలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పురేందర్ సోమవారం ప్రకటించారు. ఈసందర్భంగా పలువురు పరిశ్రమల యజమానులు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. అనంతరం నూతన చైర్మన్ మాట్లాడుతూ పారిశ్రామిక వాడ అభివృద్ధికోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇక్కడి పారిశ్రామిక వేత్తలు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా ధోరణితో ఉన్నారని వివరించారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా సత్యనారాయణరాజు గతంలో రెండు పర్యాయాలు వరుసగా చైర్మన్ బాధ్యతలు నిర్వహిర్తించించారు. ఆతర్వాత ఉత్తంరెడ్డి బాధ్యతలు చేపట్టగా ఇటీవల ఆయన పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం మూడోసారి చైర్మన్‌గా సత్యనారాయణరాజు ఎన్నికయ్యారు.

## నటుడు దుండిగల్ వినయ్‌రాజ్‌కు నంది అవార్డు



హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: సినీ నటుడు దుండిగల్ వినయ్‌రాజ్‌కు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నంది అవార్డు అందుకున్నారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ 4వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వేడుకల్లో దుండిగల్ వినయ్‌రాజ్‌కు అభిలాష సంస్థ నంది అవార్డు ప్రదానం చేసి సత్కరించింది. ఈ సందర్భంగా వినయ్‌రాజ్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వినయ్‌రాజ్ పలు సినిమాల్లో దేవుళ్ళ పాత్రలు పోషించారు. శ్రీ రంగనాయక చిత్రంలో విష్ణుమూర్తిగా నటించిన ఆయన రాముడు, కృష్ణుడు వంటి పాత్రలు కూడా చేయడం జరిగింది. 'హ్యాండ్సమ్ లుక్' చిత్రంలో హీరోగా నటించారని అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.ఎస్.సరోజనమ్మ తెలిపారు. పౌరాణిక పాత్రులు చేయడంలో వినయ్‌రాజ్ ఈ తరానికి దొరికిన సినీ అణిముత్యమని ఆమె కొనియాడారు.

## సీతాఫల్ మండి కాంగ్రెస్ సమావేశానికి తార్నాక నుంచి భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



తార్నాక, జనవరి 29 ప్రభాతవార్త: సితాఫల్ మండిలో సోమవారం జరిగిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమావేశానికి తార్నాక నుంచి భారీగా కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. టీపీసీసీ కార్యదర్శి జీడీ అమర్‌నాథ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బైక్ ర్యాలీలో అధ్యక్షులు బ్రహ్మాజీ, శైలెందర్, కిషోర్ యాదవ్, శేఖర్, రవి, జాకిర్, సుధతో పాటు పలువురు పాల్గొన్నారు.

## నేడు మహేశ్వరంలో ఉచిత మెగా వైద్య శిబిరం

సైఫాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: అవేర్ గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30న మంగళవారం ఉచిత మెగా వైద్య శిభిరాన్ని మహేశ్వరంలోని భగవతిపురంలో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మెగా వైద్య శిభిరంలో 5వేల మందికి పైగా పాల్గొనే అవకాశం ఉందని, ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా జెఎన్‌టియు వైస్-ఛాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి, ప్రభుత్వ విఫ్ రామచంద్రనాయక్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. ఈ శిభిరంలో అన్ని విభాగాల వైద్య నిపుణులు పాల్గొంటారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పికెఎస్ మాధవన్ నేతృత్వంలో అనేక సేవా కార్యక్రమాలను తరుచూ నిర్వహిస్తున్నామన్నారు.

## కార్యకర్తల కృషితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది

చిక్కడపల్లి, జనవరి 29 ప్రభాతవార్త: కార్యకర్తలు, నాయకులు చేసిన కృషి వల్ల రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం జరిగిందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారిశెట్టి నర్సింగరావు, గుండు జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు గుర్రం దినేష్, సురేందర్, శీలం సత్యనారాయణ, భాను, నరేందర్, పుస్తకాల కవిత, డిహెచ్. మధుమతి, సాల్మన్, జి.జయేందర్‌బాబు, హాఫీజ్, రాజు, యాదగిరిగౌడ్, గిరి, శిశుకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలుపుదల**

నిజాంపేట్, జనవరి 29, ప్రభాతవార్త : నేడు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సికర విల్లాస్ నుండి బాచుపల్లి సిగ్నల్ మెయిన్ రోడ్, బాచుపల్లి పోలీస్ స్టేషన్, లోటస్ ఫ్రైడ్, సాన్వి కన్‌స్ట్రక్షన్, కౌసల్య మణిదీపం, ఎస్‌వీఎం గ్రౌండ్, శ్రీరామ హోమ్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు, ప్రజలు సహకరించాలని ఏఈ శాంతకుమార్ ఒక ప్రకటనలో కోరారు.

## ఇతర ప్రాణుల గురించి మానవుడు ఆలోచించాలి

**త్రిదండి చిన జీయర్ స్వామి**



బేగంపేట జనవరి 29,ప్రభాతవార్త : సాధారణంగా మానవసేవే మాధవసేవ అని అంటారని,ఎవరూ ఈ గ్రహం మీద నివసిస్తున్న ఇతర ప్రాణులు గురించి ఎవరూ ఆలోచించరు అని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్ స్వామి అన్నారు.సోమవారం బేగంపేట లో స్వామీజీ చేతుల మీదుగా అనంత రీహాబిలిటేషన్ సెంటర్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా అయన తన అనుగ్రహ భాషణం ఇస్తూ భగవంతుడు మనందరినీ సమానంగానే సృష్టించాడన్నారు.మనం గాలి,నీరు మొక్కలు,జంతువులు,పురుగులు,ఇతర ప్రాణాల గురించి ఆలోచించాల్సిన సమయం ఇది అన్నారు.ఎందుకంటే మనం వాటితో కలిసి శాంతియుతంగా జీవిస్తున్నామన్నారు. మనుషులు మాత్రమే వైద్యుల వద్దకు,ఆస్పత్రులకు వెళ్తారు.కానీ జంతువులు తమకు అనారోగ్యం అనిపించినపుడు వాటికవే నయం చేసుకుంటాయన్నారు. ఒక కుక్కగానీ పిల్లిగానీ ఆరోగ్యం బాగోలేక పోతే ఏమీ తినకుండా ఉపవాసం చేస్తాయన్నారు. పచ్చగడ్డి తిని వాంతి చేసుకుంటాయన్నారు. ఇది ప్రకృతి సహజంగా అందించిన డీటాక్స్ ప్రక్రియ.మనుషులుగా మనం ప్రకృతిని చేసి ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. అట్టడుగు వర్గాల కోసం తరచూ వైద్య శిభిరాలు నిర్వహిస్తున్న వైద్యులు,దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేసారు, వైద్యులు బొల్లినేని భాస్కరరావు, డా.గురవారెడ్డి,డా,వేదప్రకాష్,మైహోమ్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వర రావు,ఎంపీ టీ.జీ.వెంకటేష్,ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి,మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొని తమ సందేశాలను ఇచ్చారు.

## బిసిలకు ఉపముఖ్యమంత్రి, 5 మంత్రి పదవులు ఇవ్వాలి

**బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ తదితరులు

హైదరాబాద్,జనవరి 29,ప్రభాతవార్త: మంత్రివర్గ విస్తీర్ణంలో ఉపముఖ్యమంత్రి పదవితోపాటు ఐదుమంత్రి పదవులు బిసిలకు ఇవ్వాలని జాతీయ బిసిసంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌నేత రాహుల్‌గాంధీకి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో కాచిగూడలో నిర్వహించిన సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఎన్నికల్లో బిసిలకు అనేక వాగ్దానాలు చేశాడని ఆవాగ్దానాలను సిఎం అమలు చేస్తారని ఆశిస్తున్నామన్నారు. మొదటి మంత్రివర్గంలో బిసిల ప్రాతినిథ్యం తక్కువగా ఉన్నందున త్వరలో జరిగే మంత్రివర్గ విస్త్రీర్ణంలో బిసిల ప్రాతినిథ్యం పెంచాలన్నారు. అలాగే త్వరలో భర్తీ చేయబోయే కార్పొరేషన్లు, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్లు, డైరెకక్టర్లు, మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలతోపాటు ఇతర నామినేటెడ్ పోస్టులల్లో బిసిలకు జనాభా ప్రకారం 50శాతం కేటాయించాలన్నారు. ఈకార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేష్, రామకృష్ణ, నందగోపాల్ పాల్గొన్నారు.

## భూదాన్ యజ్ఞబోర్డును పునరుద్దరించాలి

**అఖిల భారత సర్వసేవ సంఘ్**



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ హుస్సేన్, కృష్ణప్రసాద్ తదితరులు

హైదరాబాద్, జనవరి 29,ప్రభాతవార్త: గతబిఆర్ఎస్ ప్రభుత్వ ఉదాసీనతతో నిర్వీర్యమైన భూదాన్ యజ్ఞబోర్డును తెలంగాణ రాష్ట్రంలో తిరిగి పునరుద్దరించాలని అఖిల భారత సర్వసేవ సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ, తెలంగాణ ప్రభారీ షేక్ హుస్సేన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తెలంగాణ సర్వోదయ మండలి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి షేక్ హుస్సేన్ ముఖ్యఅతిధిగా ,తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు మోటూరి కృష్ణప్రసాద్ హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా షేక్ హుస్సేన్ మాట్లాడుతూ అంబేడ్కర్ అందించిన భారత రాజ్యాంగాన్ని అగ్నివీర్ వంటి తాత్కాలిక ఉద్యోగాలు ప్రవేశపెట్టి పటిష్టమైన రక్షణ వ్యవస్థను కేంద్రం ధ్వంసం చేస్తుందని మండిపడ్డారు. బిజెపి నేతల సంకుచితమైన రాజకీయాలతో దేశంలో మత విద్వేశాలను సృష్టిస్తూ భారతదేశ లౌకిక ప్రతిష్టను దెబ్బతీస్తుందన్నారు.

## అన్నదానం చేసిన టిఎన్‌జిఓ జిల్లా అధ్యక్షులు



గన్‌ఫౌండ్రి,జనవరి 29 ప్రభాతవార్త: టిఎన్‌జిఓ యూనియన్,అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఎం.ఎన్.జె క్యాన్సర్,నీలోఫర్ ఆసుపత్రి వద్ద రోగులకు సహాయకులకు డాక్టర్,సేవరత్నా, టి.ఎన్.జి.ఓ అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ అన్నదానం చేశారు.సంపూర్ణ మద్దతుతో సర్వశక్తిమంతుడు తనను ప్రతి సామాజిక కార్యక్రమాలల్లో ఎంచుకున్నట్లు చెప్పారు.తెలంగాణ మాజీ హోంశాఖ మంత్రి మహమ్మద్ అలీ ఆయురోగ్యాలతో ఉండాలని భగవంతుని కోరుకుంటున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు,మహ్మద్ అబ్దుల్ ముజీబ్,బొల్లిగద్ద శంకర్,శ్రీధర్‌నాయుడు,ఆసుపత్రి కోశాధికారి శేఖర్,జిల్లా ఎపిఆర్‌ఓ వహిద్,ము స్తాఫా షరీఫ్‌పాల్గొన్నారు.

## మంచినీటి పైప్‌లైన్ మరమ్మత్తు చేయించిన కార్పొరేటర్



బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలోని 3.వ,వార్డు పరిధిలో మంచినీటి పైప్‌లైన్ మరమ్మత్తును చేయిస్తున్న కార్పోరేటర్ సంతోషి రాజిరెడ్డి

నార్సింగి, జనవరి 29 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని మూడో వార్డులో మంచినీటి పైప్‌లైన్‌కు కార్పోరేటర్ సంతోషిరాజిరెడ్డి దగ్గరుండి మరమ్మత్తు చేయించారు. కొన్నాళ్ల నుంచి మంచినీటి పైప్‌లైన్‌లో కలుషిత నీరు కలుస్తుందని స్థానికులు తెలుపడంతో స్పందించిన కార్పోరేటర్ వెంటనే జల మండలి అధికారులకు ఈ సమస్యను తెలిపింది. అధికారులతో చర్చించి వెంటనే ఆ పైప్‌లైన్ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా ప్రతినిధిగా ఎంపికయ్యామని, ఆ బాధ్యతను సవ్యంగా పూర్తి చేసేందుకు నిరంతరం కష్టపడుతున్నామన్నారు. ఎన్నికల సమయంలో డివిజన్ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపించామని, ముఖ్యంగా భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, మంచినీటి పైప్‌లైన్ పనులు, పార్కులు వంటి అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. కార్పోరేటర్ స్పందన పట్ల స్థానిక ప్రజలు సంతోషంను వ్యక్తం చేస్తున్నారు.



రహ్మత్‌నగర్ విజ్‌డమ్ హైస్కూల్‌లో గ్రాడ్యువేషన్ డే సందర్భంగా చిన్నారులకు పట్టాలు అందజేస్తున్న పాఠశాల కరెస్పాండెంట్ అగస్టీన్



అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షుని ఎన్నికల్లో ఎన్నికల అధికారికి నామినేషన్‌ను అందజేస్తున్న వెంకటేశ్వర్లు

## ఫిబ్రవరి 4న సంక్షేమ సంఘం ఎన్నికలు

యూసుఫ్‌గూడ, జనవరి 29, ప్రభాతవార్త : ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే కాలనీ ఎన్నికల్లో భాగంగా మోతీనగర్ ప్రాంతంలోని అవంతి నగర్ తోట సంక్షేమ సంఘం ఎన్నికలు ఫిబ్రవరి 4వతేదీన నిర్వహించనున్నారు. ఇందుకు గాను సోమవారం నామినేషన్‌లను దాఖలు చేశారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికల అధికారులు దత్తాత్రేయ, ఎల్ఐసి కృష్ణాలకు ఇద్దరు అభ్యర్థులు వెంకటేశ్వర్లు, గోపాల్ చౌదరిలు నామినేషన్‌లు అందజేశారు. ఈనెల 31న అభ్యర్ధులకు గుర్తులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.ఫిబ్రవరి 4వతేది ఆదివారం ఉదయం 7:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాలు ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

దుండిగల్, జనవరి 29, ప్రభాతవార్త : సాధారణ మరమ్మత్తులో భాగంగా దొమ్మర పోచంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్1, 11కెవి ఏజిఎల్ గాగిల్లాపూర్, ఐడిఏ కేబుల్, ఐడిఏ దొమ్మర పోచంపల్లి, సత్యం, ఏజీఎల్ బౌరంపేట పీడర్ల పరిధిలోని దొమ్మరపోచంపల్లి గ్రామం, సారేగూడెం, రాజరాజేశ్వరి కాలనీ, అపురూపాకాలనీ, ఆంధ్రాబ్యాంక్, శ్లోకా స్కూల్, ప్రగతి మోడల్ స్కూల్, గండిమైసమ్మ ఎక్స్ రోడ్స్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

# అత్యాధునిక మార్చురీ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రస్టీలు

కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్త: తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన అత్యాధునిక మార్చ్యూరీని ఎంసీఈఎంఈ కమాండెంట్, లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సిదాన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వర్గ వాటిక వ్యవస్థాపక ట్రస్టీ అధ్యక్షుడు సురేందర్ పాల్‌సింగ్ మాట్లాడుతూ రాబోయే రోజులలో మూడు మాన్యువల్ చితిల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. వాటిలో ఒకటి మహా ప్రస్థానం వద్ద ఉన్నదానితో సమానంగా ఉంటుందని తెలిపారు. మార్చురీలో నాలుగు మృతదేహాలు భద్రపరిచే సామర్థ్యం ఉందని తెలిపారు. రూ. 20లక్షలతో మార్చురీ ఏర్పాటు జరిపినట్లు తెలిపారు. సివిల్ పనులకు ట్రస్టీ రాయ్ గోయల్, జనరల్ బ్యాకప్ కోసం ట్రస్టీ జేసీ జోదాన్, సీసీటీవి కోసం ట్రస్టీ జయంత్ ఉదారంగా విరాళాలు అందించారని తెలిపారు. ఈసీజీ, రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, సీబీసీ, హెచ్‌బీఏ1సీ, ఛాతీ ఎక్స్‌రేలు వంటి ఖర్చుతో కూడుకున్న ఆరోగ్య పరీక్షలు అందించే ఎనీ టైమ్ క్లీనిక్‌ని ప్రారంభించేందుకు కూడా ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. వీటికి మార్కెట్ ధరలో కేవలం 10 నుంచి 20 శాతం మాత్రమే చార్జీ చేయనునున్నట్లు పేర్కొన్నారు.

# ప్రతిభను గుర్తించి గౌరవించడం ఉత్తమ సంస్కారం

**వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్**



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

చిక్కడపల్లి, జనవరి 29 ప్రభాతవార్త: ప్రతిభను గుర్తించి గౌరవించడం ఉత్తమ సంస్కారమని, ఆ దిశగా కృషిచేస్తూ కళాకారులను గౌరవిస్తున్న మానస ఆర్ట్స సంస్థ నిర్వాహకులు అభినందనీయులు అని ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. సోమవారం శ్రీమానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సినీ దర్శక, నిర్మాత, రచయిత, నంది అవార్డుగ్రహీత లక్ష్మణరేఖ గోపాలకృష్ణ రచించిన 'భారత కీర్తిమూర్తులు' గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వాహక సంస్థ కార్యదర్శి రఘుశ్రీ ఆధ్వర్యంలో జరిగింది. చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ హాజరై ఈ గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ప్రముఖ రచయిత్రి, విద్యావేత్త ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది జివిఎల్.నరసింహారావు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ చైర్మన్ డాక్టర్ సిహెచ్.వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కమిషనర్ అభినవ్ అభిలాషను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు



కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 29, ప్రభాతవార్త : కూకట్‌పల్లి జోనల్ కమీషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్ ఐఏఎస్‌ని శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, కార్పోరేటర్లు మాధవరం రోజాదేవి రంగారావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, మాజీ కార్పోరేటర్ మాధవరం రంగారావుతో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, కూకట్‌పల్లి పార్ట్ డివిజన్ల అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న పలు సమస్యలు, చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు.

## ఒయులో సింతటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ప్రారంభం



ఒ.యూలో సింతటిక్ అత్లెటిక్స్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, విసి ప్రొ.రవీందర్ యాదవ్

తార్నాక, జనవరి 29 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.ఖేలో ఇండియా నిధులతో ఉస్మానియా యూనివర్సిటీ ఏగ్రౌండ్‌లో నిర్మించిన సింతటిక్ అథ్లెటిక్స్ ట్రాక్‌ను వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్, డిప్యూటీ మేయర్ మెతె శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి మంత్రి కిషన్ రెడ్డి లాంఛనంగా ప్రాంరభించారు. ఒ.యూలో క్రీడాకారుల సౌకర్యం కోసం స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, అథ్లెటిక్స్ ట్రాక్, ఆర్ట్స్ కాలేజ్‌కు లైటింగ్ సిష్టంను ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సినీనటుడు సాయికుమార్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, ఛీఫ్ ఇంజనీర్ కె.ఎల్ రాధిక, ఫిజికల్ ఎడ్యూకేషన్ డైరెక్టర్ ప్రొ. రాజేష్ కుమార్‌తో పాటు పలువురు అద్యాపకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడాలి : సాగర్‌గౌడ్



బండ్లగూడ కార్పోరేషన్‌లో ప్రభుత్వ భూములను కబ్జా కాకుండా చూడాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పోరేటర్ సాగర్‌గౌడ్

నార్సింగి, జనవరి 29 ప్రభాతవార్త : గండిపేట మండలం బండ్లగూడ కార్పోరేషన్ సికిందర్‌గూడలో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి కాపాడాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకకు కార్పోరేటర్ సాగర్‌గౌడ్ వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ గత కొంత కాలంగా సికిందర్‌గూడాలోని ఎకరాల కొద్ది ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, నకిలి పత్రాలతో ఎలాంటి అనుమతులు లేకుండానే లేఔట్ చేసి, ప్లాట్లను విక్రయిస్తున్నారని తెలిపారు. కోట్ల రూపాయల విలువైన భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించి, దాన్ని మైనార్టీల కోసం స్మశాన వాటిక, ప్రభుత్వ గృహాల పథంక, యువత, ప్రజాభవనం, ప్లేగ్రౌండ్‌లకు కేటాయించా లని కలెక్టర్‌ను కోరినట్లు వివరించారు. అలాగే ఆర్డీఓ, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్‌లకు కూడా ఫిర్యాదు చేసినట్లు సాగర్‌గౌడ్ తెలిపారు.

## అవార్డులు వారి బాధ్యతను మరింత పెంచుతాయి



రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ 2023 2024 వోకేషనల్ అవార్డు అందుకున్న వివిధ సంస్థల ప్రతినిధులు

**మాజీ ఐపీఎస్ అధికారి ఏ.కే.ఖాన్**

బేగంపేట జనవరి 29,ప్రభాతవార్త : ప్రతి ఏటా వివిధ విభాగాలలో విశేష సేవలందించిన వారిని గుర్తించి అవార్డులు అందిస్తుంటారని, అలా అవార్డులు పొందిన వారిపైన మరింత బాధ్యతను పెంచుతాయని మాజీ ఐ పీ ఎస్ అధికారి ఏ.కే. ఖాన్ అన్నారు. సోమవారం బేగంపేట హోటల్ ఫార్చ్యూన్ మనోహర్ లో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ 2023,2024 సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాలలో విస్తృత సేవలు అందించిన వారికి వోకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డులను అందించింది. ఈ కార్యక్రమానికి ఏ.కే.ఖాన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మమతా త్రివేది, నచికేత తపోవన్ ఛైర్ పర్సన్ వసుంధరరెడ్డి ,విరించి హాస్పిటల్ ఛైర్‌పర్సన్ మాధవిలత,జి జి హాస్పిటల్స్ ఛైర్మన్ దారా గంగాధర్ గుప్తా,శ్రీశక్తి గ్రూప్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ డి.వి.మనోహర్ అవార్డుల ను అందజేసారు. ఈ కార్యక్రమంలో డా.జ్యోతిరెడ్డి, క్లబ్ అధ్యక్షులు వజ్రాల రాజగోపాల్, సెక్రటరీ సత్యాపింజల,వోకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు ఛైర్ పర్సన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## రసరంజితం శాస్త్రీయ సంప్రదాయ నృత్యాల సంక్రాంతి సంబరాలు




స్వర్ణనంది పురస్కారంతో బాబూమోహన్‌ను సత్కరిస్తున్న రమణారావు, దైవబుశర్మ, లలితారావు తదితర అతిథులు

రవీంద్రభారతి, జనవరి 29 ప్రభాతవార్త : ప్రపంచ రికార్డుల గ్రహీత భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వ ర్యంలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కె.వి. రమణారావు అధ్యక్షతన జరిగిన సంక్రాంతి స్వర్ణ నంది పురస్కారాల ప్రదానోత్సవం, రసరంజిత శాస్త్రీయ సంప్రదాయ నృత్యాలతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. 20మంది నృత్య గురువుల శిష్యులు 500మంది అన్నమయ్య, రామదాసు, త్యాగరాజ కీర్తనలు తదితర పలుఅంశాలతో శాస్త్రీయ సంప్రదాయ జానపద నృత్యాలను తెలుగుజాతి సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా రసరమ్యమైన రసోస్పాద నాట్యవిన్యాసాలతో ఆధ్యాత్మిక శోభను వెదజల్లి ఆహుతుల భక్తిపరవసుల్ని చేసి ప్రశంసలందుకున్నారు.

## మూడోసారి అసెంబ్లీకి పంపిన ప్రజలకు ధన్యవాదాలు



ఎమ్మెల్యే వివేకానందను గజమాలతో సత్కరిస్తున్న ప్రజలు

జీడిమెట్ల, జనవరి 29, ప్రభాతవార్త : మీ ప్రతినిధిగా నన్ను ముచ్చటగా మూడోసారి అసెంబ్లీకి పంపిన కుత్బుల్లాపూర్ ప్రజలకు ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సోమవారం 125 గాజులరామారం డివిజన్ బతుకమ్మ బండలో ఎమ్మెల్యే వివేకానంద చేపట్టి కృతజ్ఞత యాత్ర 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిచేసే నాయకుడికే మా ఓటు అంటే 85,576 ఓట్ల మెజార్టీతో తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపేందుకు ఈ కృతజ్ఞత యాత్ర నిర్వహిస్తున్నానని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉండి రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ రావల శేషగిరి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్, ఇబ్రహీం, ఆంజనేయులు, ముసాఖాన్, మురళి, శ్రీనివాస్, ప్రసాద్, చిన్న చౌదరి, మహేష్, నారాయణ, బతుకమ్మ బండ కాలనీ వాసులు చెట్ల వెంకటేష్, మంజుల, యాదగిరి, మల్లేష్, శివప్ప, చందన, అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జీబీఎన్ తొలి వార్షికోత్సవం

**వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి సత్కారం**



హైదరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: వ్యాపార సామ్రాజ్యంలో ఉన్నతమైన అడుగులు వేస్తున్న గౌడ్స్ బిజినెస్ నెట్‌వర్క్ (జీబీఎన్) తొలి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో బోనాలు నిర్వహించిన జీబీఎన్ సభ్యులు అనంతరం నాగోల్‌లోని సంస్కృతి వరల్డ్ స్కూల్‌లో జీబీఎన్ కౌండిన్యోత్సవం-బిజినెస్ ఫెస్ట్‌ను సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా జీబీఎన్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. జీబీఎన్ అధ్యక్షులు చీకటి ప్రభాకర్‌గౌడ్ మాట్లాడుతూ ఏడాది క్రితం ప్రారంభమయిన జీబీఎన్ ఈస్ట్ జోన్‌లో రెండవ చాప్టర్‌ను జీబీఎన్ చాణక్య పేరుతో ప్రారంభించుకున్నామని, త్వరలోనే నగర నలుమూలలకు విస్తరింపచేస్తూ ప్రతి జిల్లా కేంద్రంలో జీబీఎన్ చాప్టర్లు ప్రారంభించుకుంటామని తెలిపారు. జీబీఎన్ గ్రోత్ అంబాసిడర్ రవిగారి ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ ఏడాది కాలంలోనే జీబీఎన్ సభ్యుల మధ్య పది కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు జరగటం విజయానికి ప్రతిక అన్నారు. తెలంగాణ కల్లుగీత కార్పోరేషన్ తొలి ఛైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ్స్ వ్యాపారుల ఆర్థిక విప్లవాన్ని సృష్టించటమే ప్రధాన లక్ష్యంగా సాగుతున్న బిజినెస్ నెట్‌వర్క్ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలలో గౌడ సంఘాల సీనియర్ నాయకులు చింతల మల్లేశం, చరిత్ర పరిశోధక రచయిత కొంపల్లి వెంకట్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారుడు కోట శ్రీనివాస్‌గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎలికట్టే విజయకుమార్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్, బలగం సినిమా ఫేం సంజయ్‌గౌడ్, సుప్రజ హాస్పటల్ ఛైర్మన్ అంబటి శ్రీనివాస్ గౌడ్, సీనియర్ జర్నలిస్టులు రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు. ఆర్ఎంపి, పిఎంపిలకు ప్రాథమిక వైద్యంపై శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు ఇవ్వాలి

## బోయిన్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం




ఉచిత వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు

కంటోన్మెంట్, జనవరి 29 ప్రభాతవార్తః బోయిన్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆధ్వర్యంలో వివిధ రకాల స్కానింగ్ పరీక్షలతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేసి నిర్వహించిన ఉచిత వైద్య శిభిరంను నిర్వహించారు. ఈ కార్యాక్రమానికి సీఈఓ డాక్టర్ ప్రమోద్ గుప్త, ఎండీలు సురేష్, ప్రవీన్ గుప్తలు ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రారంభించారు. దాదాపు 250 మంది ఉచితంగా వైద్య పరీక్షలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా సీఈఓ డాక్టర్ ప్రమోద్ గుప్త మాట్లాడుతూ మద్యం సేవించే వారికి ఎక్కువ సమయంపాటు కూర్చునేవారికి, ఒబెసిటీ, డయాలసిస్, అధిక కొవ్వు కలిగి ఉన్నవారికి ప్రత్యేకంగా వైద్య పరీక్షలు ఈ శిభిరంలో నిర్వహించారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపినీ జరిపినట్లు వివరించారు,. ఈ కార్యాక్రమంలో డాక్టర్ హాసీని, డాక్టర్ సురేందర్ పాల్గొన్నారు.

## టైపిస్ట్, స్టెనో గ్రాఫర్ ఉద్యోగాల పునరుద్దరణకు కృషి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

తార్నాక, జనవరి 29 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టైపిస్ట్,స్టెనో గ్రాఫర్ ఉద్యోగాల పునరుద్దరణకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్స్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టైప్ రైటింగ్,షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎండి మసూద్ అలి, ప్రశాంత్, అనిల్, మధు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలి : కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



మైలార్‌దేవ్‌పల్లి,జనవరి 29 ప్రభాతవార్త : తల్లి దండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కాటేదన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన బేటీ బచావ్ బేటి పడావో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేద పిల్లల అభ్యున్నతికి,పేద పిల్లల భవిష్యత్తు కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు.ప్రతీ ఒక్కరూ బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీభాయి, పద్మజా, ప్రధానోపాధ్యాయులు రఘువతి, మాణిక్యం రెడ్డి, అంగన్ వాడి టీచర్స్,మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.




బ్యాంకు యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సర్వసభ సమావేశం ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

### మనం ఫౌండేషన్ ఫౌండర్

## ఆర్ఎస్ కుమార్‌కు అరుదైన గౌరవం



మనం ఫౌండేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఆర్.ఎస్.కుమార్‌కు గౌరవ డాక్టరేట్‌తో సత్కరిస్తున్న డాక్టర్ ఆకుల రమేష్, నరసింహారావు, కాసుల శ్రీకాంత్

హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త: మనం ఫౌండేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఆర్.ఎస్.కుమార్‌కు అరుదైన గౌరవం లభించింది. ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారి సౌజన్యంతో గౌరవ డాక్టరేట్ అవార్డును సోమవారం అందుకున్నారు. అందరి సహకారంతో ఈ అరుదైన గౌరవం దక్కిందని ఆర్ఎస్ కుమార్ అన్నారు. ఇందుకు సహాయ సహకరాలు అందించిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరినిన సేవలను అందించి ప్రముఖుల మన్ననలను అందుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ నిర్వాహకులు, కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు ఆర్ఎస్‌కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రతినిధి, స్ఫూర్తి ఎన్‌జివో సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ ఆకుల రమేష్, నరసింహారావు గంజి, కాసుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నాలుగు నెలలైనా స్ట్రీట్ లైట్స్ వేయరా

**జీహెచ్ఎంసీ అధికారులపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్**

మొదటి పేజీ తరువాయి..

స్ట్రీట్‌లైట్లు లేవని, అర్ధరాత్రి బస్తీలో బయటకు రావాలంటే భయంగా ఉందని వాపోయారు. నవంబర్‌లో ఫిర్యాదు చేసినా, అధికారులు పట్టించుకోలేదని.. నాలుగు నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని తెలిపారు. బస్తీలో అర్ధరాత్రి నడవాలంటే భయం భయంతో ఇళ్లకు చేరుకోవాల్సి వస్తుందని తెలిపారు. అధికారులకు చెప్పి బస్తీలో స్ట్రీట్ లైట్లు వేయించాలని తెలిపారు. అధికారులతో మాట్లాడిన కేంద్రమంత్రి వెంటనే అధికారులను అక్కడికి పిలిపించారు. ఎందుకు స్ట్రీట్ లైట్లు వేయలేదని ప్రశ్నించారు. ఒకటి కాదు రెండు రోజులు కాదు నాలుగు నెలలుగా సమస్య చెబుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదంటూ సీరియస్ అయ్యారు. ఈ సంధర్భంగా గుడిమల్కాపూర్‌లోని బిజెపి జనహిత పార్టీ కార్యాలయంలో దేవర కరుణాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ నాయకులు వి.భుజేందర్ కుమార్, దేవర వంశీ కార్యకర్తలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## దళితుల ఇళ్లు నేలమట్టం

మొదటి పేజీ తరువాయి..

అనంతరం బస్తీలోని 20 ఇళ్ళను నేలమట్టం చేశారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు తాము ఇళ్ళను కూల్చివేయడం జరిగిందని, మరోవైపు స్థానిక బస్తీవాసులు మాత్రం తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఇళ్ళను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము 60 ఏండ్ల నుంచి ఎక్కడ నివాసముంటున్నామని, తమ తర్వాత నిర్మించుకున్న శతాబ్ది అపార్ట్‌మెంట్ వాసులు తాము రోడ్డు ఆక్రమించుకుని ఇళ్ళను నిర్మించుకున్నామి ఆరోపిస్తూ కోర్టుకు వెళ్తారని బస్తీ వాసి ఆనంద్‌రావు తెలిపారు. గత 10 సంవత్సరాలకుపైగా కోర్టులో కేసు కొనసాగుతోందని, అధికారులు మాత్రం తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం తమ ఇండ్లను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫిబ్రవరి 8,9న చలో ఢిల్లీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ముషీరాబాద్, జనవరి 29, ప్రభాతవార్త: ఫిబ్రవరి 8, 9 తేదీలలో ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఛలో ఢిల్లీ గోడ ప్రతులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 22 రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణన చేపడతామని స్పష్టం చేశాయి కానీ అధికారంలో ఉన్న బీజేపీ మాత్రం దీనిపై తమ వైఖరి వెల్లడించకుండా బీసీలపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన రోజు నుండి బీజేపీ బీసీలకు చేసిన మేలు ఏమీ లేదని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ సమగ్ర కుల గణనపై తమ రాజకీయ విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 8న ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద బీసీల ధర్నా, 9 వ తేదీ అఖిల భారత జాతీయ ఓబీసీ సదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రం గౌడ్, కనకాల శ్యాంకుర్మ, ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, జాజుల లింగం, గొడుగు మహేష్‌యాదవ్, బూడిద మల్లికార్జున యాదవ్, పానుగంటి విజయ్, సత్తమ్మ, మధుయాదవ్ పాల్గొన్నారు.

## అనారోగ్యంతో గృహిణి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 29 ప్రభాతవార్త : అనారోగ్యంతో బాధ పడుతున్న ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. షాదనగర్‌కు చెందిన వెంకటేష్,సక్కమ్మ దంపతులు కిస్మత్‌పురలో నివాసం ఉంటున్నారు.వీరికి ఇద్దరు ఆడపిల్లలు,ఒక కొడుకు కలరు.కాగా గత కొంత కాలం నుంచి సక్కమ్మ తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతున్నది.మందులు వాడుతున్నప్పటికి ఆరోగ్య సమస్యలు తగ్గక పోవటంతో జీవితంపై విరక్తి చెందిన సక్కమ్మ ఆదివారం రాత్రి వంట ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్మకు పాల్పడింది.



భ్రమరాంభ ఆలయంలో సమీపంలో అనుమతుల్లేని షెడ్డు

## బరితెగింపు

మొదటి పేజీ తరువాయి..

మార్గంలో, లహరి వెంచర్‌లో అనుమతుల్లేని షెడ్లు నిర్మాణాలు చోటుచేసుకున్నాయి.

**దృష్టిసారించని టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్, హెచ్ఎండిఏ** మున్సిపాలిటీ పరిధిలో భారీషెడ్లు నిర్మాణాలకు హెచ్ఎండిఏ అనుమతులు తప్పనిసరి. హెచ్ఎండిఏ నిబంధనల ప్రకారం ఫీజులు చెల్లించడంతో పాటు సెట్‌బ్యాక్‌లతో నిర్మాణాలు చేపట్టాలి. అయితే హెచ్ఎండిఏ అనుమతులు పొందడం కాదుకదా..కనీసం ధరఖాస్తు చేసుకోకుండానే పదుల సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్న విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్, హెచ్ఎండిఏ అధికార యంత్రాంగం దృష్టి సారించకపోవడం పలు అనుమానాలు తావిస్తోంది. స్థానిక అధికారులతో పాటు వివిధ విభాగాల అధికారులను సైతం అక్రమార్కులు తమదైనశైలిలో ఆకట్టుకోవడంతోనే చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు లేకపోలేదు. అధికార యంత్రాంగం అంతా కలిసికట్టుగా సహకరించడంతోనే అక్రమార్కులు తమ నిర్మాణాలను ఎటువంటి ఆటంకం లేకుండా కొనసాగిస్తున్నట్లు సమాచారం.

**ఈ మున్సిపాలిటీలో నిబంధనలు ప్రత్యేకం..** రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మున్సిపల్ చట్టం నిబంధనలు ఒకేలా ఉంటే దుండిగల్ మున్సిపాలిటీలో మాత్రం భిన్నంగా కొనసాగుతున్నాయి. ఇక్కడ స్థానికులకు ఒక విధంగా స్థానికేతరులకు మరో విధంగా ఉంటాయి. ఇది మున్సిపల్ సిబ్బంది మాటలు, వ్యవహారశైలినే తెలుపుతుంది. భౌరంపేట పరిధిలో జరుగుతున్న భారీషెడ్ల విషయంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని అనుమతుల విషయమై అడిగితే నిర్మాణాలు స్థానికులవి అని సమాధానం. అనుమతులు విషయం ఏమిటి అంటే స్థానికులు అని చెప్తున్నాము కదా మళ్ళీ అనుమతులు ఏంది అని పేర్కొంటున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమీషనర్‌ను వివరణ కోరగా అక్రమ నిర్మాణాలను గుర్తించే పనిలో చైన్‌మెన్లు నిమగ్నమయ్యారు. ఎటువంటి అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు మాదృష్టికి తీసురాలేదు. పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది గుర్తించకపోవడం కమీషనర్ దృష్టికి వెళ్ళకపోవడం అంతా కుబేర తంత్రమే.

**జిల్లా కలెక్టర్ స్పందించాలి..** ప్రభుత్వం నిబంధనలను అతిక్రమించి భౌరంపేట పరిధిలో కొనసాగుతున్న అనుమతుల్లేని భారీషెడ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ స్పందించాలని మున్సిపల్‌వాసులు కోరుతున్నారు. అక్రమాలపై స్థానిక అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేసిన చర్యలు శూన్యమని మండిపడుతున్నారు. ఆపని..ఈపని పేరుతో అక్రమాలపై ఉదాసీనంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారని ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమనిర్మాణాలపై విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## అర్ధరాత్రి సైకో హాల్‌చల్

దీంతో వెంటనే అతను తప్పించుకొని పక్కకు పారిపోవడంతో కొద్దిపాటి గాయాలతో భయటపడ్డాడు. దాడి చేసిన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. వెంటనే అక్కడికి చేరుకున్న మార్కెట్ పోలీసులు 108కు సమాచారం అందించారు. మొదట దాడిలో గాయపడిన వ్యక్తి తీవ్ర రక్తస్రావంతో అప్పటికే మరణించగా మిథేష్ యాదవ్‌ను గాంధీఆస్పత్రికి తరలించారు. చనిపోయిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని, సుమారు 45 సంవత్సరాలుంటుందని, ఫుట్‌పాత్‌పై ఆవాసం ఉండే వ్యక్తి అయి ఉంటాడని మార్కెట్ పోలీసు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

## సాఫ్ట్‌వేర్ శిక్షణకు వచ్చి దొంగగా మారి..

తాళం విరగకొట్టడానికి ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో కిటికి గ్రిల్ తొలగించి లోపలకి ప్రవేశించారు. బెడ్‌రూములోని కప్‌బోర్డులో ఉన్న బంగారు ఆభరణాలుతో పాటుగా నగదును దొంగలించారు. 28వ తేదీ సాయంత్రం ఓల్డ్‌అల్వాల్ విబిఆర్ గార్డెన్స్ వద్ద బైక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దొంగతనం విషయం బయట పడింది. నిందితులు వద్ద నుంచి పల్సర్ బైక్‌తో పాటుగా రెండు బంగారు గాజులు, బంగారు చైన్, 4.50వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

## వైభవంగా హరికథా మహోత్సవ వారోత్సవాలు : డా. కె.వి.రమణాచారి

నాంపల్లి, జనవరి 29 ప్రభాతవార్త : కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శ్రీ శృంగేరి శంకరమఠం నల్లకుంట హైదరాబాద్‌లో ఫిబ్రవరి 1 నుండి 7వరకు వారం రోజులపాటు ప్రతీరోజూ రాత్రి 6గంటల నుండి హరికథా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఐఎఎస్ అధికారి, పూర్వ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి మీడియా తెలిపారు.

## దాతల ఫోటోలు వేయకుండా పాఠశాల భవనాలను ప్రారంభించడం విడ్డూరం

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎమ్మెల్సీ నవీన్ కుమార్

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 29, ప్రభాతవార్త : కూకట్‌పల్లి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను తొలగించి దాతలు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ సహాయంతో నూతన పాఠశాల భవనాలను నిర్మిస్తే అధికారులు మాత్రం కనీసం దాతల ఫోటోలను వేయకుండా ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి మండల ప్రాథమిక పాఠశాలను నూతనంగా నిర్మించిన పాఠశాల భవనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 44 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని వాటిలో కొన్ని పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా రాజీవ్ గాంధీ నగర్‌లో, కూకట్‌పల్లిలో దాతలు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ సహాయం తో వారి తాతయ్య అమ్మమ్మ మాధవరం రామచంద్రరావు మాధవరం సుశీలమ్మ స్మారకంగా రెండు పాఠశాల భవనాలను నిర్మించారన్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను దాతల సహాయంతో నూతన భవనాలను నిర్మిస్తామని ప్రభుత్వాలు మారినా కూకట్‌పల్లిలో అభివృద్ధి ఆగదని అన్నారు. పాఠశాల భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేసిన దాతలు కొండలరావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఓ విజయకుమారి, ఎంఈఓ ఆంజనేయులు, కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహా యాదవ్, సతీష్‌గౌడ్, సబిహా గౌసుద్దీన్ పాల్గొన్నారు.

## జిల్లా నెహ్రూ యువ కేంద్రం సలహా కమిటి సభ్యులుగా శివచంద్ర గిరి



నియామక పత్రం అందుకుంటున్న శివచంద్ర గిరి

చార్మినార్,జనవరి 29 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీకి చెందిన భాగ్యనగర్ జిల్లా బిజెవైఎం అధ్యక్షులు ఎ.శివచంద్రగిరి హైదరాబాద్ జిల్లా నెహ్రూ యువ కేంద్రం సలహా కమిటి సభ్యులుగా నియమితులయ్యారు.జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి ఖుష్బూ చేతుల మీదుగా సోమవారం శివచంద్ర గిరి నియామక పత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా శివచంద్ర గిరి మాట్లాడుతూ జిల్లా నెహ్రూ యువ కేంద్రం సలహా కమిటి సభ్యులుగా తనను నియమించినందుకు కేంద్ర యూత్ సర్వీసెస్, క్రీడల శాఖల మంత్రి అనురాగ్ ఠాకూర్,భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు ఎస్.సురేందర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థులకు ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహించాలి

యూసుఫ్‌గూడ, జనవరి 29, ప్రభాతవార్త : విద్యార్థులకు చదువుతో పాటు వారు ఎంచుకున్న రంగాలలో తగిన విధంగా ప్రోత్సాహం అందించినపుడే వారు భవిష్యత్తులో రాణించగలుగుతారని బోరబండ ఇన్స్‌పెక్టర్ ఎస్ విజయ్ అన్నారు. రహ్మత్‌నగర్‌లోని విజ్‌డమ్ హైస్కూల్‌లో నిర్వహించిన గ్రాడ్యువేషన్ డే లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

## ఇండ్లను కూల్చివేస్తామని జిహెచ్ఎంసి అధికారులు నోటీసులు



వెన్నెలగడ్డ వాసులతో మాట్లాడుతున్న భరత్ సింహారెడ్డి

పేట్ బషీరాబాద్, జనవరి 29, ప్రభాత వార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో వెన్నెలగడ్డలో ఎన్నచెరువు ప్రక్కన గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఇండ్లను కూల్చివేస్తామని జిహెచ్ఎంసి అధికారులు నోటీసులు ఇచ్చారని బస్తీ వాసులు తెలియజేయడంతో సోమవారం బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి వెన్నెలగడ్డలో పర్యటించి నోటీసులను పరిశీలించారు.



ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌తో కలిసి రంనాస్‌పుర డివిజన్‌లో 5కోట్ల 70 లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించినప్పటి చిత్రం


IN THE COURT OF THE HON'BLE I SENIOR CIVIL JUDGE, HYDERABAD. AT: CHETHABAZAR. SOP.NO. 122 OF 2023

**Between:**
Lalkote Venkatesh & others
...Petitioners/Plaintiffs
And
1.Union Bank of India Karvan Branch, Gudimalkapur, Mehdipatnam, Hyd.
2. All concerned
...Respondents/Defendants

**NOTICE**

The plaintiff has filed the above suit/Petition for grant of succession Certificate, in respect of the suit/Petition fix deposited amount of 49,000. The Hon'ble court was pleased to order for publication of this Notice for your appearance in the above suit and the matter is posted to 05.02.2024 at 10:30 a.m. and therefore you may appear before this Hon'ble court either in person or through your authorized counsel otherwise the matter will be adjudicated in due process of Law.

Late L. Suvarna is the mother of plaintiff no. 1 to 4. L. Suvara has having her bank account in Union Bank of India at karvan Branch with bearing account no. 083510100161876, the balance amount in the account 49,000/- (Forty Nine Thousand Rupees Only).

(BY ORDER OF THE COURT)
G. Sandeep
A. Srikanth
(Advocates)
Phone:- 7396272177.

## బైరామల్‌గూడ చెరువులోకి డ్రైనేజీ నీరు రాకుండా చర్యలు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



చెరువు వద్ద జంక్షన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** బైరామల్‌గూడ చెరువులోకి డ్రైనేజీ నీరు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం అధికారులు, కాలనీవాసులతో కలసి చెరువును సందర్శించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులోకి యుజిడి నీరు రాకుండా ఉండడానికి మూడేళ్ల క్రితం కృష్ణానగర్ నుంచి బైరామల్‌గూడ గ్రామం, శుభం ప్యాలెస్‌మీదుగా సరూర్‌నగర్ చెరువు వరకు 4 ఫీట్ల యుజిడి లైన్‌ను ప్రత్యేకంగా వేయించడం జరిగిందని, అయితే చెరువువద్ద ఉన్న జంక్షన్‌ను సరిగ్గా శుభ్రం చేయకపోవడం వల్ల డ్రైనేజీ నీరు చెరువులోకి వస్తుందన్నారు. జంక్షన్‌వద్ద ప్రతిరోజు చెత్తను తీయడానికి విధిగా ఒక వ్యక్తిని ఏర్పాటు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. జంక్షన్ వద్ద ఎప్పటికప్పుడు క్లీన్ చేయడంవల్ల చెరువులోకి డ్రైనేజీనీరు రాకుండా చూడవచ్చన్నారు. అదేవిధంగా చెరువు వద్ద ఉన్న గేటు ఫంక్షనింగ్‌ను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇ పవన్, ఎల్‌బినగర్ సర్కిల్ కమీషనర్ దశరథ, ఇఇ కోటేశ్వరరావు, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, నాయకులు సుంకోజు కృష్ణమాచారి, ముడుపు రాజిరెడ్డి, ఉమామహేశ్వర్, బొంబాయి, మల్లేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా అభివృద్ధి పనులు : బలాల




అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, జనవరి 28 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గంలో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని వాహెద్‌నగర్‌లో సుమారు 3.96 కోట్లతో నిర్మించనున్న స్ట్రీట్‌వెండింగ్ జోన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహెద్‌నగర్‌లో త్వరలో ఏర్పాటు చేయనున్న స్ట్రీట్ షాపుతో ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం నాయకుడు సైపుద్దీన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

## దశలవారిగా అభివృద్ధి పనులు : కొప్పుల

**హయత్‌నగర్, జనవరి 29 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా కాలనీల్లో అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నట్లు జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని సిరిహిల్స్. పవనగిరి కాలనీ ఫేజ్-3, శివంహిల్స్ కాలనీల్లో పర్యటించి కాలనీవాసుల సమస్యలను, పూర్తయిన అభివృద్ధి పనులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని ప్రజలు చెల్లిస్తున్న పన్నులతోనే అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు వివరించారు. చాలా కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులను ప్రారంభించి వేగంగా పనులను పూర్తి చేయిస్తామన్నారు. మిగిలిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి దశలవారిగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రతినిధులు రాజిరెడ్డి, హరినాథ్ నేత, కృష్ణారెడ్డి, పీవీరావు, రవీందర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

## చాకలివాగుపై బ్రిడ్జీ పనులను పూర్తి చేస్తాం



బ్రిడ్జీని పరిశీలిస్తున్న అధికారులు

**హయత్‌నగర్, జనవరి 29 ప్రభాతవార్త:** సాధ్యమైనంత త్వరలో చాకలి వాగుపై బ్రిడ్జీ పనులను ప్రారంభించి పూర్తిచేస్తామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ మధుసూదన్ తెలిపారు. పెద్దఅంబర్‌పేట నుంచి కోహెడ వెళ్లేదారిలో చాకలివాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జీ పనులు కొంతకాలంగా నిలిచిపోయాయి. దీంతో అటుగావెళ్లే వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. కౌన్సిలర్ బొర్ర అనురాధ సురేష్ ఇటీవల ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి అసంపూర్తి బ్రిడ్జీ పనులను వివరించి వెంటనే పనులను చేపట్టేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే బ్రిడ్జీ పనులను ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు కాంట్రాక్టరుతో కలిసి బ్రిడ్జీ నిర్మాణపనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పను లు ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో డీఈఈ వేణుగోపాల్‌రెడ్డి, కాంట్రాక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు సమస్యల పరిష్కారానికి కృషి : డిఇ సురేష్



సబ్‌స్టేషన్‌లో పర్యటిస్తున్న డిఇ సురేష్ తదితరులు

**మలక్‌పేట, జనవరి 28 ప్రభాతవార్త :** విద్యుత్ వినియోగదారులకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చంపాపేట డివిజన్ విద్యుత్ శాఖ డిఇ పెద్దింటి సురేష్ పేర్కొన్నారు. చంపాపేట విద్యుత్ శాఖ డివిజన్ పరిధిలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్లను సందర్శించి వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అదేవిధంగా విద్యుత్‌సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అడ్డు ఉన్న చెట్ల కొమ్మలను సిబ్బందితో తొలగింపజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవికాలం దృష్ట్యా వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పలు ప్రాంతాల్లో వంగిపోయిన విద్యుత్ స్థంభాలు తొలగించి వాటి స్థానంలో నూతన సిమెంట్ స్థంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా అందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మశ్రీ సోమ్‌లాల్‌నాయక్‌కు సత్కారం



పద్మశ్రీ సోమ్‌లాల్‌నాయక్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 29 ప్రభాతవార్త :** హబ్సిగూడలో నివాసం ఉంటున్న పద్మశ్రీ సోమ్‌లాల్‌నాయక్‌ను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సత్కరించారు. ఈ మేరకు సోమవారం ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితోపాటు, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల విడుదలచేసిన పద్మపురస్కారాలలో సాహిత్య రంగంలో సోమ్‌లాల్‌నాయక్ చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించిందని తెలిపారు.హిందువుల పవిత్ర గంధం భగవద్గీతను బంజారా బాషాలోకి అనువధించారని, ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. 16నెలల పాటు తీవ్రంగా కృషి చేసి భగవద్గీతలోని 701 శ్లోకాలను బంజారా బాషాలో అనువధించారని కొనియాడారు. ఎస్‌బిఐ బ్యాంక్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన సోమలాల్ బంజార జాగృతి జాతి కోసం 250కి పైగా పాటలురాశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పసుల ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు డా.బి.వి.చారి, కాలేరు జైనవీన్, లింగా నాయక్, రవినాయక్, బి.కైలాసపతిగౌడ్, తిప్పని సంపత్, సంజయ్‌జైన్, హరీష్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## అస్తవ్యస్త డ్రైనేజీతో కాలనీవాసుల ఇబ్బందులు



అధికారులకు సమస్యలు వివరిస్తున్న ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మధురపురికాలనీలో కార్పొరేటర్ సోమవారం పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజ్ బ్లాక్ అవడంతో మురుగునీరు పొంగిపోవడంతో కాలనీవాసులకు, వ్యాపారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారిందని సమస్య పరిష్కరించే విధంగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమస్య తలెత్తకుండా జలమండలిఅధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మేనేజర్ రజిత, యాదయ్యగుప్తా, శ్రీనివాస్, శ్రీకాంత్, కాలనీవాసులు దశరథ్, పరశురాం, సంతోష్, భాస్కర్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్, శ్రవణ్‌గౌడ్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరవు




ప్రజావాణిలో పాల్గొన్న జోనల్ కమిషనర్ పంకజ

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. గతంలో ప్రజావాణి కార్యక్రమంలో విలువల అనేకమంది దరఖాస్తులు చేసుకున్న అధికారుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనడానికి ఆసక్తిని చూపడం లేదు. దీంతో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఎల్బీనగర్‌జోనల్ పరిధిలోని 5 సర్కిళ్లకు సంబంధించి కేవలం 6 దరఖాస్తులు మాత్రమే రావడం గమనార్హం. దరఖాస్తులకు సంబంధించి అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించకపోవడం వల్లే ప్రజావాణిలో దరఖాస్తు చేయడానికి ప్రజలు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు.

## రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



విడిసిసి రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

**సైదాబాద్, జనవరి 18 ప్రభాతవార్త:** రోడ్ల నిర్మాణంలో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. లోకాయుక్త కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న విడిసిసి రోడ్డును పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో అవసరమైన చోట నూతన రోడ్లు, యుజిడిల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, రవీందర్, దేశ్‌పాండే, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇంటర్ నేషనల్ టోర్నమెంట్ కరాటే పోటీలు



కరాటే పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు

**తుర్కయాంజాల్, జనవరి 28 ప్రభాతవార్త :** వరల్డ్ నాక యామ షోటోఖాన్ కరాటే కుంపు అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం తలపెట్టిన 2వ ఇంటర్‌నేషనల్ టోర్నమెంట్ పోటీలకు ముఖ్య అతిథిగా సినీ హీరో సుమన్ తల్వార్ విచ్చేసారు. ఈ పోటీల్లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ ఆపిల్ రెవెన్యూ కాలనీవాసులు బ్రూస్ లీ జిట్కెండో అకాడమీ మాస్టర్ సంరెడ్డి విశ్వేశ్వర్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 9 గోల్డ్ మెడల్స్ 2 సిల్వర్ మెడల్స్ అందించారు. గోల్డ్ మెడల్ సాధించిన విజేతలు ధనుశ్రీ, గేయదాత్రి, విగ్నేష్, అభి, రాకేష్, శివసాత్వి,యువరాజ్, దుర్గాప్రసాద్, మహమ్మద్ అలీ, సిల్వర్ మెడల్ సాధించిన విజేతలు హరిణి, లోకేష్ బ్లాక్ బెల్ట్ గ్రాండ్ ఛాంపియన్‌షిప్ విభాగంలో గోల్డ్ మెడల్ విజేత సత్తిబాబు, గ్రాండ్ మాస్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిరు పేదలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే మర్రి



రైల్వే పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి..

**నేరెడ్‌మెట్ జనవరి 29 ప్రభాతవార్త:** వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని తారకరామానగర్, దినకర్ నగర్‌లలో రైల్వే ట్రాక్ పరిసరప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఇటీవల రైల్వేశాఖ నుండి వచ్చిన నోటీసులపై ఎటువంటి ఆందోళన అవసరం లేదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మ ర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానికులతో కలసి దినకర్‌నగర్, తారకరామానగర్ రైల్వే ట్రాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేట్రాక్ పరిసరప్రాంతాల్లో ఇండ్లను కోల్పోతున్న బాధిత కుటుంబాలకు అండగానిలిచి న్యాయపోరాటం చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, శేఖర్‌గౌడ్, సురేష్, రావుల అంజయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

**కళాశాల సమస్యలను పరిష్కరిస్తా...** నేరెడ్‌మెట్ వాజ్‌పేయినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి కళాశాల ప్రిన్సిపల్‌తో కలిసి పరిశీలించారు. కళాశాలలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రిన్సిపల్ ఎమ్మెల్యేకు తెలియజేసారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే కళశాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నా గెలుపు కోసం బాగా పని చేశారు.. గుర్తుంచుకుంటా: సబితా ఇంద్రారెడ్డి




కార్యకర్తలకు కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 29 ప్రభాతవార్త:** నా విజయం కోసం పని చేసిన ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకుంటానని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితాఇంద్రారెడ్డి స్పష్టం చేశారు.సోమవారం మీర్‌పేట్‌మున్సిపల్ కార్పొరేషన్ లోని జిల్లెలగూడ ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అనుబంధ విభాగాల వారికి కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా జరిగిన నియోజకవర్గ ఎన్నికల్లో పని చేసిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా మహిళలు సైతం ఈ ఎన్నికల్లో బాగా పని చేశారని ఆమె కితాబిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలో గెలిచిన తాను అందరికీ అండగా ఉంటానని ఆమె స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తితో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పని చేసి విజయం సాధిద్దామని ఆమె సూచించారు.

**సర్పంచ్‌లనే పర్సన్ ఇంఛార్జిలుగా కొనసాగించాలి...** మహేశ్వరం, కందుకూరు మండలాల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుండడంతో ఎన్నికలు జరగనందున ప్రస్తుతం ఉన్న సర్పంచ్‌లనే పర స్న్ ఇంఛార్జిలనే కొనసాగించాలని సబితారెడ్డి ప్రభుత్వానికి సూచించారు. స్పెషలాఫీసర్లుగా ఇతరులను నియమిస్తే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతుందని ఆమె తెలిపారు. ఈ నెల 6 నుండి నియోజకవర్గంలో తాను పర్యటనలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ సభలో మీర్‌పేట్ మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మహేశ్వరం ఇంఛార్జి ఎంపిపి సునీత, కందుకూరు పార్టీ అధ్యక్షుడు జయేందర్, మహేశ్వరం అధ్యక్షుడు రాజు నాయక్, మీర్‌పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, ఆర్‌కెపురం అధ్యక్షుడు నగేశ్, మాజీ ఎంపిపి సిద్దాల లావణ్య బీరప్ప, బడంగ్‌పేట్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, పార్టీ నాయకులు దీప్‌లాల్ చౌహాన్, సింగిల్ విండో ఛైర్మన్లు పాండు యాదవ్, చంద్రశేఖర్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి : ఇన్స్‌పెక్టర్ కాశీ విశ్వనాథ్

**సరూర్‌నగర్, జనవరి 29 ప్రభాతవార్త:** మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఇన్స్‌పెక్టర్ ఎం.కాశీ విశ్వనాథ్ కోరారు. పిఎస్ పరిధిలోని నందనవనం కాలనీలో ఆదివారం సాయంత్రం ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన స్థానికులనుద్దేశించి కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో నేరాలను చాలా శాతం వరకు కట్టడి చేయవచ్చన్నారు. అవాంఛనీయ సంఘటనలు గానీ అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక పనులు జరిగినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. వాటిపై ఎవరైనా సమాచారం ఇస్తే అట్టి వారి పేర్లను గోప్యంగా ఉంచి వారికి ఇబ్బందులు రాకుండా చేస్తామని ఇన్స్‌పెక్టర్ స్పష్టం చేశారు. నేరాల నివారణ కోసం తమ తమ ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు గోవిందు స్వామి, ఈరోజీ, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, జనవరి 29 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎఇ నిఖిల్ తెలిపారు.ఉప్పల్ 11 కెవి కల్యాణపురి పీడర్ పరిధిలోని కల్యాణపురి, నార్త్ కల్యాణపురి, రాఘవేంద్రనగర్ కాలనీ, బాలాజనీ ఎన్‌క్లేవ్, విసాతత్ ఎన్‌క్లేవ్, టీచర్స్‌కాలనీ, సీతారామకాలనీ, అన్నపూర్ణకాలనీ, శ్రీ రాఘవేంద్రకాలనీ, శ్రీగిరికాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా 11 కెవి ఎసియన్ పీడర్ పరిధిలోని ఉప్పల్ ఖల్సా, ప్రధాన రహదారి, స్వరూప్‌రెడ్డికాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటలనుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 11 కెవి వెంకటేశ్వర టెంపుల్ పీడర్ పరిధిలోని వెంకటేశ్వర టెంపుల్‌ఏరియా, స్వరూప్‌నగర్, పద్మావతికాలనీ, సెవెన్‌హిల్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటలనుంచి 5 గంటలవరకు సరఫరా నిలిపివేస్తున్నామని ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని సూచించారు.

## నాచారం డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**నాచారం, జనవరి 29 ప్రభాతవార్త:** నాచారం డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో రూ.2కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. నాచారం ప్రధాన రోడ్డు సెయింట్ పీటర్ స్కూల్ నుంచి ఇందిరానగర్ శాంతి గార్డెన్స్ వరకు, హెచ్‌ఎంటీ స్ట్రీట్ నెం.3లో రూ. కోటి 30 లక్షల సీసీ రోడ్డు పనులకు వారు శంకుస్థాపనలు చేశారు. అదేవిదంగా వార్డు కార్యాలయం నుంచి నాచారం బార్డర్ ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాల్, కల్లు కాంపౌడ్ వరకు, అక్కడి నుంచి భక్త సమాజం వరకు రూ. 70లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యురాలు విద్యా స్రవంతి, టీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, మల్లేష్ యాదవ్, అశ్వద్దామ రెడ్డి, రామకృష్ణ, దాసరి కర్ణ, మంగోల్ శివ కుమార్, విఠల్ యాదవ్, చంద్రశేఖర్, యాదగిరి, కట్టబుచ్చన్న గౌడ్, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చింది : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి తదితరులు

**అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 29 ప్రభాతవార్త:** ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ, బాచారం, బండరావిరాల, చిన్నరావిరాల, గువ్వలేటి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతోన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పథకాలకు తోడు మరో రెండు పథకాలను ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ పథకాలను వచ్చే వారం రోజుల్లో ప్రజలకు అందించనున్నామని, మిగిలిన పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ 100 రోజుల్లో అందించే విధంగా రేవంత్‌రెడ్డి సర్కారు కసరత్తు చేస్తున్నదన్నారు. మిగులు బడ్జెట్‌తో అప్పగించిన తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని, గత పదేళ్ల తెలంగాణ ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నేతలకు ప్రజలు మరింత బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను దశల వారిగా పూర్తి చేస్తామని, సంక్షేమ పథకాల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ దత్, ఎంపీపీ బుర్ర రేఖా మహేందర్‌గౌడ్, జడ్పీటీసీ బింగి దాసుగౌడ్, వైస్‌ఎంపీపీ కొలన్ శ్రీవధర్‌రెడ్డి, సర్పంచులు బుర్ర వీరస్వామిగౌడ్, పారంద సంతోష, కవాడి శ్రీనివాస్‌రెడ్డి, సురకంటి వనజ, మాజీ సర్పంచ్ సేవర్తి శ్రీనివాస్, ఉపసర్పంచులు ఉప్పు సురేష్, మోర ప్రభాకర్‌ముదిరాజ్, ఎంపిటీసీలు వెంకటేష్, దంతూరి అనిత, మండల కోఆప్షన్‌సభ్యుడు ఎండీ గౌస్‌పాష,ఎంపీడీఓ మమతాబాయి, ఎంపీఓ వినోద, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్, పెద్దఅంబర్‌పేట కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కుక్కల బెడదను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పవన్ వినతి

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజకు సోమవారం డివిజన్ పరిధిలోని పలు సమస్యలకు సంబంధించి కార్పొరేటర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనుల కోసం సీసీ రోడ్డు తవ్వడంతో రోడ్లన్నీ పాడైపోయాయని రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. పలు కాలనీలలో డ్రైనేజీ లైన్ పనులు పూర్తి చేయడంతో రోడ్లన్నీ పడైపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీసీరోడ్లు మంజూరు చేయాలని కోరారు. ఎస్ఆర్ఎల్ కాలనీమీదుగా మూసినదికి వెళ్లే బాక్స్ డ్రైనేజ్ పనులు సగంలోనే ఆపడంతో కాలనీవాసులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాలనీలలో కుక్కల బెడద ఎక్కువై చిన్నారులపై దాడి చేస్తున్నాయని వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచి రాజేష్, సత్యనారాయణ, సాయిగౌడ్ పాల్గొన్నారు.

## చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు

**హైదరాబాద్, జనవరి 29 ప్రభాతవార్త:** చైతన్యపురి పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఘట్‌కేసర్ డిఐగా బాధ్యతలు నిర్వహించారు. చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న నాగార్జున ఓ కేసు విషయంలో నిర్లక్ష్యం వహించాడని మల్టీ జోన్ టుకు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో వెంకటేశ్వర్లు బదిలీ అయ్యారు.

## పహాడీషరీఫ్ ఇన్స్‌పెక్టర్‌గా గురువారెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 29 ప్రభాతవార్త:** పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్స్‌పెక్టర్‌గా పి.గురువారెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల వరకు ఇక్కడ ఇన్స్‌పెక్టర్‌గా పని చేసిన సతీష్ భూవివాదాల్లో జోక్యం చేసుకుంటున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై సస్పెండ్ కాగా ఆయన స్థానంలో ఇంఛార్జిగా బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ వెంకట్‌రెడ్డిని కమీషనర్ నియమించారు. అయితే కొత్తగా పహాడీషరీఫ్‌కు రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్‌బాబు మల్కాజిగిరి జోన్‌లో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న గురువారెడ్డిని నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం పిఎస్‌లో ఛార్జ్ తీసుకున్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఎఇ

**కుషాయిగూడ, జనవరి 29, ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతుల కారణంగా కుషాయిగూడ సబ్ స్టేషన్, కాప్రా ఫీడర్ పరిధిలో ఈనెల 30 మంగళవారం ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలవరకు ఏపీఐఐసీ కాలనీ, భవానినగర్, పల్లె ఎంక్లేవ్ శ్రీనగర్ కాలనీ, హాన్స్ అవెన్యూ, విరాట్‌నగర్, శ్రీరామ్‌నగర్, ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ ఏఈ రామకృష్ణ తెలిపారు. ఈ అసౌకర్యాన్ని గుర్తించి ప్రజలు సహకరించాలని కోరారు.

## కోదండరాంకు నాయకుల అభినందనలు

**తుర్కయాంజాల్, జనవరి 28 ప్రభాతవార్త :** తెలంగాణ జేఏసీ చైర్మన్, ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపట్ల పూర్వ హయత్‌నగర్ మండల జేఏసీ కన్వీనర్ కందాల బలదేవరెడ్డి, నాయకులు కొంతం యాదిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కోదండరాంను సోమవారం ఇరువురు నేతలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కోదండరాం అన్ని పార్టీలనాయకులను ఏకంచేసి, విద్యార్థి, యువజన ప్రజా సంఘాలను ఐక్యం చేయడంలో కోదండరాం సఫలీకృతమయ్యారని పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా సకల జనులను, సబ్బండ వర్గాలను ఏకం చేయడంలో ఘనత ఆయనదన్నారు. అలాంటి నేతకి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

## మల్కాజిగిరి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చరణ్‌జీత్‌గౌడ్



చరణ్‌జీత్‌గౌడ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న మైనంపల్లి, శ్రవణ్

**మల్కాజిగిరి, జనవరి 28 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జీడి చరణ్‌జీత్‌గౌడ్‌ను నియమించడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు నివాసంలో చరణ్‌కు నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేసారు. ఈ కార్యక్రమంలో బి.బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, బికె.శ్రీనివాస్, జీడీ సంపత్‌గౌడ్, వైనాల ప్రవీణ్, నవీన్‌గౌడ్, నాగేష్ గౌడ్, నాగేందర్‌గౌడ్, రోహిత్‌గౌడ్, కొండగౌడ్, సనాది శంకర్, సాయిబాబా, సాయికిషోర్, నితిన్‌గౌడ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.